
సాక్షి
పల్నాడు

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



కల్యాణ వేంకన్నకు అభిషేకం

దుగ్గిరాల:పసుపు యార్డు సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరాలయంలో శుక్రవారం స్వామికి అభిషేకం చేశారు. స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు: పొన్నూరు పట్టణ పరిధిలో శుక్రవారం అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వీరాంజనేయ స్వామి సేవలో ఎస్పీ



పొన్నూరు: పట్టణంలోని శ్రీ వీరాంజనేయస్వామిని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వీరా నాయక్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు మాచర్లలో సీఎం పర్యటన



మాచర్లరూరల్: 'స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మాచర్ల పట్టణానికి సీఎం చంద్రబాబు శనివారం రానున్నారు. ఆయన ఉదయం 10.30 గంటలకు సాగర్ రోడ్డులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 10.45 నుంచి 11.05 గంటల వరకు 23వ వార్డు యాదవ బజారులో నిర్వహించే 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు. 11.10 నుంచి 11.28 గంటల వరకు ఆర్టీసీ గ్యారేజీ వద్ద సఫాయి కార్మికులు, మెడికల్ సిబ్బందితో కలిసి మాటామంతీ కార్యక్రమంలో పాల్గొంటారు. స్వచ్ఛత రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తారు. అనంతరం ప్రజా వేదిక వద్ద స్టాళ్లను సందర్శించి, వేదికపై నుంచి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆటోనగర్ వద్ద పార్టీ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. తర్వాత యాదవుల బజారులో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు తదితరులు శుక్రవారం సీఎం పర్యటించే ప్రాంతాలలో ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు చేశారు.

సుప్రీంకోర్టులోనూ ఉచిత న్యాయ సహాయం

13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్. సత్యశ్రీ

నరసరావుపేట టౌన్: మధ్య ఆదాయ వర్గాల వారికి సుప్రీంకోర్టులో ఉచిత న్యాయ సహాయం అందించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్. సత్యశ్రీ శుక్రవారం తెలిపారు. సుప్రీంకోర్టులో ఉన్న మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్ లీగల్ ఎయిడ్ సొసైటీ ద్వారా సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. సంవత్సరానికి రూ. 12 లక్షలలోపు ఆదాయం ఉన్నవారు దీనికి అర్హులని వివరించారు. ఈ అవకాశాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాహుకేతు పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు



పెదకాకాని: శివాలయంలో రాహుకేతు గ్రహ పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ జీవీడీఎల్ లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 21వ తేదీన మహాలయ అమావాస్య ఆదివారం కావడంతో ఈ పూజలు చేయించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని శుక్రవారం ఆయన పేర్కొన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని రాహుకేతు పూజా మండపం వద్ద షామియానాలు, క్యూలైన్‌లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున 4 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ జరిగే ఈ పూజలకు ఆలయ ప్రధాన కౌంటర్‌లో టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

నేడు కోర్టు ప్రాంగణంలో సమావేశం

నరసరావుపేట టౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీస్ ఫర్ చిల్డ్రన్ పథకంపై శనివారం సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రధాన సివిల్ జడ్జి కె.మధుస్వామి శుక్రవారం తెలిపారు. విద్య, ఆరోగ్య, మహిళాశిశు సంక్షేమం, పంచాయతీ రాజ్, కార్మిక సంక్షేమ శాఖల అధికారులతో 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణంలో ఈ సమావేశం జరగనుందని పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



మంగళగిరిటౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో ఈనెల 22వ తేదీ నుంచి జరగనున్న శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల శుభ ఆహ్వానపత్రికను దేవస్థానంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయ అధికారులు మాట్లాడారు.

పోలీసు నిర్బంధం

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ శుక్రవారం చేపట్టిన చలో మెడికల్ కళాశాల కార్యక్రమంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కార్యక్రమంలో పాల్గొనకుండా పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు ముందుగానే నోటీసులు జారీ చేశారు. అర్ధరాత్రి నుంచి వారి ఇళ్ల వద్ద పోలీసు బలగాలను మోహరించి బయటకు రాకుండా అడ్డుకున్నారు. మండల స్థాయి నాయకులను అరెస్టు చేసి స్టేషన్లలో నిర్బంధించారు. కళాశాలలకు వెళ్లే మార్గాలన్నింటిని మూసి వేశారు. అటువైపు ఎవ్వరూ వెళ్లకుండా అడుగడుగునా తనిఖీలు నిర్వహించారు. పోలీసు ఆంక్షలు, నిర్బంధాలను ఛేదించుకుని కొంతమంది కళాశాల వద్దకు చేరుకున్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునే తీరుతామని నాయకులు స్పష్టం చేశారు.



సత్తెనపల్లి పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, విద్యార్థులు

- మెడికల్ కళాశాల చుట్టూ భారీ బందోబస్తు
- చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి అడుగడుగునా తనిఖీలు
- పార్టీ నేతల గృహ నిర్బంధం
- మీడియాపైనా ఆంక్షలు
- పోలీసు వలయం ఛేదించుకుని కళాశాల సందర్శన

చలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల కార్యక్రమం విజయవంతం

పిడుగురాళ్ల: రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం చలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరుకాకుండా పిడుగురాళ్ల పట్టణ పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. పిడుగురాళ్ల పట్టణంలోని కొండమోడు సమీపంలో, పోలీస్‌స్టేషన్ వద్ద, ఖలీల్ దాబా వద్ద ఉన్న బైపాస్ రోడ్డులో, బ్రాహ్మణపల్లి బైపాస్ వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కారులు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు రానివ్వకుండా అడ్డుకున్నారు. పోలీసుల ఆంక్షలను లెక్క చేయకుండా సుమారు 300 మంది మెడికల్ కాలేజీ వద్దకు చేరుకున్నారు. వారిలో 50 మందిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 250 మందిని పిడుగురాళ్ల మార్కెట్ యార్డులో నిర్బంధించారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు వైద్య కళాశాలకు వచ్చే వారిని కవరేజ్ కోసం సాక్షి మీడియా బృందం విధులు నిర్వహిస్తుంటే అక్కడ కూడా పోలీసులు వీడియోలు, ఫొటోలు తీయనివ్వకుండా ఆంక్షలు విధించారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా విలేకరులు పోలీస్‌స్టేషన్ బయట నుంచి అదుపులోకి తీసుకుంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఫొటోలు తీస్తే పోలీసులు దౌర్జన్యంగా ఫొటోలను డిలీట్ చేయాలని హుకుం జారీ చేశారు. అక్కడికి చేయని పక్షంలో చేతిలో ఉన్న ఫోన్‌ను లాక్కొని పోలీసులే తీసిన ఫొటోలను, వీడియోలను డిలీట్ చేశారు. ద్విచక్ర వాహనాలపై వచ్చే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారిని తిరిగి గ్రామాలకు వెనుదిరిగాలని లేనిపక్షంలో పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని చెప్పి కొందరిని వెనుదిరిగేలా చేశారు.

నాయకుల హౌస్ అరెస్టు

పిడుగురాళ్ల పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌తోపాటు కార్యకర్తలను హౌస్ అరెస్టు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రేపాల శ్రీనివాసరావును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వీరభద్రునిరామిరెడ్డి, గురజాల నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు సాంబశివరావుతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను పట్టణ పోలీసులు హౌస్ అరెస్టు చేసి అడ్డుకున్నారు. అరెస్టు అయిన వారిలో గురజాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చల్లా పిచ్చిరెడ్డి, గురజాల నియోజకవర్గ మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ జైలాబ్దిన్, కౌన్సిలర్ కొక్కెర శ్రీను, పాశం వెంకటేశ్వరరెడ్డి(చిన్నోడు), జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు జబీర్, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి ఇల్లూరి వెంకటరామిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వీరారెడ్డి, కరాలపాడు సర్పంచ్ చల్లా శివారెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ, కామేపల్లి సర్పంచ్ ముప్పూరి వెంకటప్పయ్య, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ పిచ్చిరెడ్డి, మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ షేక్‌మాబు, మాజీ మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌డీఎల్, పిడుగురాళ్ల పట్టణ ఉపాధ్యక్షులు కందులూరి శివయ్య, చల్లా ఆవులయ్య, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు చింతల జానకిరామయ్య, శివరాత్రి నారాయణ, కానాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ షేక్ సలాంతోపాటు యువజన, విద్యార్థి విభాగ నాయకులు ఉన్నారు.



నాయకులను అరెస్టు చేసి బస్సు ఎక్కిస్తున్న పోలీసులు



సీపీఎం జిల్లా కార్యదర్శి జి.విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు



నిరసన ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘాలను అడ్డుకుంటున్న పోలీసులు



మెడికల్ కళాశాల వద్ద సెల్ఫీ దిగుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పిడుగురాళ్లలోని పిల్లుట్ల రోడ్డులో పహారా కాస్తున్న పోలీసులు



జాతీయ రహదారిపై ఖలీల్ దాబా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటుచేసి తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రైవేటుపరం ఓ పెద్ద స్కామ్

- ఏడాదికి రూ.600 కోట్లు చొప్పున రూ.2400 కోట్ల అక్రమ ఆదాయం
- పార్టీ కార్యాలయంలో మీడియాతో డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేయటంలో పెద్ద స్కామ్ దాగి ఉందని, దీనికి చంద్రబాబు, లోకేష్‌లు తెర తీసారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం కేవలం లంచాల కోసం తన చంచాలకు అప్పచెప్పే ప్రయత్నమని పేర్కొన్నారు. దీని వలన మేనేజ్‌మెంట్ కోటా కింద ఒక్కో సీటు రూ.2కోట్లకు అమ్ముకుంటారని, సుమారుగా 300 సీట్లతో ఏడాదికి రూ.600 కోట్లు ఆదాయం వస్తుందన్నారు. వచ్చే నాలుగేళ్లలో రూ.2400 కోట్లు దోచిపెట్టే ప్రయత్నమే ఈ మెడికల్ కళాశాల వ్యవహారమని అన్నారు. తనకు అధికారం అప్పగిస్తే సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు జగనన్న సృష్టించిన సంపద అమ్ముతూ రాష్ట్రంలో విధ్వంస పాలన చేస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబుది సుపరిపాలన కాదని విధ్వంసపాలనగా అభివర్ణించారు. ప్రజలు అసహ్యించుకుంటున్నారని,. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కరువైందన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన మెడికల్ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అప్పచెప్పకుండా పప్పుబెల్లాల్లా అమ్ముకుంటున్నారన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం ద్వారా ఈ గుడ్డి ప్రభుత్వానికి తెలియచెప్పేందుకు ప్రయత్నిస్తున్న తమను హౌస్ అరెస్టు చేయటమేమిటని ప్రశ్నించారు. పార్టీ సమన్వయకర్తలైన తనతోపాటు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, విడదల రజిని, డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, నంబూరు శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడులను హౌస్ అరెస్టు చేశారన్నారు. హైదరాబాదు నుంచి కార్యక్రమానికి తరలివస్తున్న కాసు మహేష్‌రెడ్డిని మిర్యాలగూడ వద్ద అరెస్టు చేయటం దారుణమని అన్నారు. పిడుగురాళ్లలోని మెడికల్ కాలేజీ 80శాతం పూర్తయిందని, 90 శాతం వైద్యశాల పూర్తయిందన్నారు. కేవలం పది శాతం పూర్తిచేస్తే ప్రారంభించవచ్చన్నారు. 2019కు ముందు కేవలం 11 మెడికల్ కళాశాలలు బాబు కట్టిస్తే జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో 17 కళాశాలల నిర్మాణం చేపట్టారన్నారు. ఉత్తరప్రదేశ్‌లో 75మెడికల్ కళాశాల నిర్మాణాలను ఆ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. మెడిసిన్ చదివేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ఫిలిఫ్‌పెన్స్, కిర్గిస్తాన్ లాంటి విదేశాలకు పంపిస్తున్నారని చెప్పారు. 2023–24 నాటికి ఐదు మెడికల్ కళాశాలలు పూర్తిచేసి ప్రారంభించారని, దీని వలన అదనంగా రాష్ట్రానికి 750 సీట్లు కలిసి వచ్చాయన్నారు. వచ్చే 2029 నాటికి మరో నాలుగు మెడికల్ కళాశాలలు సిద్ధమౌతాయన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పనులు ఆపేస్తూ జీఓ జారీచేసిందన్నారు. జగన్‌పై కోపంతో పులివెందులలో సీట్లు వద్దని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాశారన్నారు. పది మెడికల్ కళాశాలలను పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో అప్పచెప్పేందుకు టెండర్లు ఆహ్వానించిందని, కేవలం సింగిల్ టెండర్‌దారు వచ్చినా అప్పచెప్పే విధంగా నిబంధనలు సవరించారని, ఇది పెద్ద స్కామ్‌గా ఆయన అభివర్ణించారు. కేవలం 16 నెలల్లో రూ.2 లక్షలకోట్లు అప్పుచేసిన కూటమి ప్రభుత్వం రూ.5500 కోట్లతో మెడికల్ కళాశాలలను పూర్తి చేయలేరా అని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ ఇన్స్యూరెన్స్ కంపెనీకి ధారాదత్తం చేస్తున్నారన్నారు.

ఈ రాష్ట్రంలో వనరులని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పి కోట్లకు కోట్లు దోచుకునే కార్యక్రమం చేస్తున్న చంద్రబాబు, లోకేష్‌ల దుర్మార్గపు కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఒప్పందాన్ని రద్దు చేస్తామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే కాసును అడ్డుకున్న పోలీసులు

- మిర్యాలగూడలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సాగర్ మీదుగా నరసరావుపేట తరలింపు



మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కారులో తరలిస్తున్న పోలీసులు



రాష్ట్ర సరిహద్దులోని పొందుగల చెక్‌పోస్ట్ వద్ద మోహరించిన పోలీసులు

దాచేపల్లి: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ శుక్రవారం నిర్వహించతలపెట్టిన 'చలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల' కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి వస్తున్న గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని దాచేపల్లి సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని మిర్యాలగూడ వద్ద అడ్డుకున్నారు. మిర్యాలగూడ సమీపంలో మహేష్‌రెడ్డి కారును ఆపిన పోలీసులు నిరసన కార్యక్రమానికి వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. శాంతియుతంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తాను వెళ్లాల్సిందేనని మహేష్‌రెడ్డి పట్టుబట్టారు. పోలీసులు ససేమిరా అన్నారు. మహేష్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలియడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వివిధ మార్గాల ద్వారా భారీ సంఖ్యలో మిర్యాలగూడ చేరుకున్నారు. ఒక దశలో కార్యకర్తలతో కలసి నడుచుకుంటూ మెడికల్ కళాశాల వద్దకు వెళ్లేందుకు కాసు ప్రయత్నించారు. సుమారుగా 60 మంది పోలీసులు మహేష్‌రెడ్డిని చుట్టుముట్టారు. పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ మెడికల్ కళాశాల వద్దకు వెళ్లి సెల్ఫీ ఛాలెంజ్ ద్వారా ప్రభుత్వానికి సవాలు విసరాలని మహేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం కాసును అదుపులోకి తీసుకోని బలవంతంగా కారులో ఎక్కించారు. మిర్యాలగూడ నుంచి హాలియా, నాగార్జునసాగర్ మీదుగా నరసరావుపేట తరలించారు. పోలీసుల తీరు పట్ల మహేష్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన జరుగుతున్న ఈ ఉద్యమానికి పోలీసులు ఆటంకాల సృష్టించడం పట్ల ఆయన మండిపడ్డారు.

పొందుగుల చెక్‌పోస్టు వద్ద భారీ బందోబస్తు

రాష్ట్ర సరిహద్దు పొందుగుల చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేపై బారికేడ్లు పెట్టి ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. నగర పంచాయతీలో ఉన్న వైఎస్సార్ సీపీ నేతలతోపాటు మండలంలో ఉన్న నాయకుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు కోటా కృష్ణ, షేక్ సుభాని, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, వైస్ చైర్మన్లు కొమెరాబత్తిన విజయకుమార్, షేక్ ఖాదర్ బాషా, అధికార ప్రతినిధి షేక్ జాకీర్ హుస్సేన్, నాయకులు కుందూరు తిరుపతిరెడ్డి, జక్కా అశోక్, మునగా శ్రీనివాసరావు, పరిమి బాబు, షేక్ ఇమామ్ వలి, గాదె రామకృష్ణారెడ్డి, జంగాల సింగర్ యాదవ్, మేడతి నరసింహారావు, బొమ్మిరెడ్డి నరసింహారావు, మోమిన్ నాగుల్, మీరా, ముత్యం చెన్నారెడ్డి, అకూరి వీరారెడ్డి, ముడి విక్టర్ పాల్, ఎస్.అనిల్, మండపాటి వీరారెడ్డి, కొండా నాయక్, సైదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుని తీరతాం..

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: పేదలకు నాణ్యమైన వైద్యం, విద్యార్థులకు వైద్య విద్య అందించడం కోసం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలను చంద్రబాబు ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని, ఈ దుర్మార్గాన్ని అడ్డుకుని తీరుతామని వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. చలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి వస్తున్న మహేష్‌రెడ్డిని ఏపీ పోలీసులు తెలంగాణ రాష్ట్రంలోని మిర్యాలగూడ సమీపంలో శుక్రవారం అడ్డుకున్నారు. మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే కాసు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, పోలీసుల తీరుపై మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపద సృష్టించి 17 కళాశాలను స్థాపిస్తే... ఇప్పుడు ఆ కళాశాలలను చంద్రబాబు అమ్ముకుంటున్నాడని దుయ్యబట్టారు. ఒక్కొక్క మెడికల్ కళాశాలను రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లు తీసుకొని నారాయణకు లేక ఇతర ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం ద్వారా చంద్రబాబు చరిత్రహీనుడిగా నిలిచిపోవడం ఖాయమని అన్నారు. ఏడాదికి రూ.30 వేలు చెల్లిస్తే వైద్య విద్యను అందించే అవకాశాన్ని జగన్ కల్పిస్తే.. ఈ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం ద్వారా ఏడాదికి ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేస్తారని తెలిపారు. పిల్లల భవిష్యత్తు కోసం తాము చేస్తున్న శాంతియుత ఉద్యమానికి అన్ని వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందని తెలిపారు. ప్రజాహితం కోరే ప్రతి ఒక్కరూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రోజు 2 వేల మందిని అరెస్టు చేస్తే..రేపు లక్ష మందితో ఉద్యమిస్తాం అప్పుడు జైళ్లు కూడా సరిపోవని పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే మళ్లీ మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని స్వాధీనం చేసుకొని తీరుతామని మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు మూలగుండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కందుల జాను, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కోట కృష్ణ, షేక్ సుభాని, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, అధికార ప్రతినిధి షేక్ జాకీర్ హుస్సేన్, వైస్ చైర్మన్లు కొమరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యారంగ సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి



నరసరావుపేట ఈస్ట్: అసెంబ్లీ సమావేశాలలో కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కార దిశగా నిర్ణయాలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ లింగిశెట్టి బాలనవ్యశ్రీ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు నవ్యశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన యువగళం పాదయాత్రలో 77, 107, 108 జీఓలను రద్దు చేస్తామని ప్రకటించారని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచినా జీఓల రద్దు మాట అటుంచి వైద్యవిద్యను ప్రైవేటు పరం చేసేందుకు నిర్ణయించటం దారుణమన్నారు. ప్రైవేటు పరం చేయటాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేసారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దాసరి హేమంత్‌కుమార్, ఎం.మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి, యువజన విభాగాల నేతలపై కేసు నమోదు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పిడుగురాళ్ల మండలం కామేపల్లిలోని చలో ప్రభుత్వం మెడికల్ కళాశాలను సందర్శించేందుకు వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో గుంటూరు నుంచి వస్తున్న నాయకులను సత్తెనపల్లిలో పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా వెళుతున్నప్పటికీ పోలీసులు వాహనాలను నిలిపివేసి పూర్తిగా అడ్డుకోవడంతో ఆయా విభాగాల నాయకులు, విద్యార్థులు పేరేచర్ల-కొండమోడు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించారని 7వ సచివాలయ గ్రామ రెవెన్యూ అధికారిణి చిరుమామిళ్ల అరుణ ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ జే.శ్రీనివాసరావు 10 మంది నాయకులపై కేసు నమోదు చేశారు. వారిలో విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, యువజన విభాగం గుంటూరు, కృష్ణా జిల్లాల కోఆర్డినేటర్ కళ్లం హరికృష్ణారెడ్డి, ఆయా విభాగాల నాయకులు పులగం సందీప్‌రెడ్డి, ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, చిన్నాబత్తిన వినోద్‌కుమార్, పేటేటి నవీన్‌కుమార్, షేక్ సుభాని, వై కోటేశ్వరరావు, బీ.రవీంద్ర, కోనూరి శశిధర్ లపై కేసు నమోదు చేసి నోటీసులు అందించారు.

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక నిరంకుశ పాలన

- మాజీ మంత్రి విడదల రజిని
- చలో మెడికల్ కాలేజీకు హాజరుకాకుండా హౌస్ అరెస్ట్

చిలకలూరిపేట: రాష్ట్రంలో ప్రజావ్యతిరేక నిరంకుశ పాలన కొనసాగుతోందని... ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజల గొంతుకగా మారి, ప్రజల పక్షాన పోరాడుతామని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి పిలుపు మేరకు పార్టీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. పిడుగురాళ్లలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనకుండా మాజీ మంత్రి విడదల రజిని నివాసం వద్ద పట్టణ పోలీసులు గురువారం రాత్రి నుంచే పహారా ఏర్పాటు చేశారు. శుక్రవారం చలో మెడికల్ కాలేజ్ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన మాజీ మంత్రిని అర్బన్ సీఐ పి రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకొని హౌస్ అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించారు. రజిని మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీల నిర్వహణ జరిగితే ప్రజలకు మేలు జరుగుతుందని, ఏ ప్రాంతంలో ఏ కాలేజి నిర్మాణం జరిగిందో అక్కడ శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టేందుకు వెళుతుంటే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. బాధ్యతగల ప్రతిపక్షంగా ప్రజల సమస్యలపై పోరాడే అధికారం తమకు ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ పోలీసులు అనుమతించకుండా గృహ నిర్బంధం విధించారు.



చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి వెళ్లకుండా మాజీ మంత్రి విడదల రజినిని అడ్డుకుంటున్న అర్బన్ సీఐ పి రమేష్

ప్రతి జిల్లాకు ఓ మెడికల్ కళాశాల

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి పరిపాలన కాలంలో 17 మెడికల్ కాలేజీలను అనుమతులు తెచ్చి రూ.8,500 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మొదటి విడతగా ఐదు కళాశాలలను పూర్తిచేసి తరగతులను ప్రారంభించినట్లు వివరించారు. రెండో విడతగా మరో ఐదు మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మూడో విడతగా ఏడు మెడికల్ కాలేజీలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కళాశాలల ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని చెప్పారు. పేదల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధి లేని కూటమి ప్రభుత్వం ఈ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు ధారాదత్తం చేసేందుకు కుయుక్తులు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటుకు అప్పగించి జేబులు నింపుకొనే కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు కుప్పాల ప్రభుదాస్, పార్టీ పట్టణ, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల అధ్యక్షులు షేక్ దరియావలి, దేవినేని శంకరరావు, మంగు ఏడుకొండలు, వడ్డేపల్లి నరసింహారావు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ గోపిరెడ్డిని అడ్డుకున్న పోలీసులు

నిరసన వ్యక్తంచేసిన డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన చలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి గురువారం రాత్రే హౌస్ అరెస్టుచేస్తూ నోటీసులు అందజేశారు. కార్యాలయం ముందు పోలీసులు కాపలాగా ఉన్నారు. అయినప్పటికీ శుక్రవారం ఉదయం నాయకులు, కార్యకర్తలతో కలిసి బయలుదేరేందుకు పార్టీ కార్యాలయం నుంచి బయటకురాగానే సీఐ హైమారావు తన సిబ్బందితో వారిని వారించారు. తమకు సహకరించాలని కోరారు. దీంతో రోడ్డుపై నిలబడి మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని, డౌన్‌డౌన్ చంద్రబాబు, పవన్ కల్యాణ్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. రైతు విభాగ జిల్లా అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి, నాయకులు పానుగోటి వెంకటరావు, పచ్చవ రవీంద్రబాబు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, తన్నీరు శ్రీనివాసరావు, అన్నా మోహన్, గంటెనపాటి గాబ్రియేలు, హెల్డా ఫ్లారెన్స్, గోగుల మనోహరయాదవ్, కొత్తూరి కిషోర్‌బాబు పాల్గొన్నారు.



డాక్టర్ గోపిరెడ్డి, నాయకులను వెళ్లేందుకు వీలులేదని చెబుతున్న సీఐ హైమారావు

చంద్రబాబు డైవర్షన్ రాజకీయం చేస్తున్నారు..

- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- చలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల కార్యక్రమానికి వెళుతున్న నాయకులను అడ్డుకోవడంపై మండిపాటు

వినుకొండ: రాష్ట్ర ప్రజల సమస్యలపై పోరాటానికి వెళ్తుంటే అడ్డుకోవడం ఏమిటని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరెస్టులు మంచివి కావని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్మించిన మెడికల్ కళాశాలల వద్ద నిరసన కార్యక్రమానికి వెళుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు గురువారం రాత్రి పోలీసులు నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. శుక్రవారం తెల్లవారుజాము నుంచి పోలీసులు ఆయనను గృహ నిర్బంధం చేశారు. బొల్లా మీడియాతో మాట్లాడుతూ సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు నాయుడు జగనన్న సృష్టించిన సంపదను ఎందుకు అమ్ముకుంటున్నారని ప్రశ్నించారు. 2029లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని, అధికారంలోకి వచ్చిన వెంటనే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఒప్పందాన్ని రద్దు చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చూపిస్తూ గత ప్రభుత్వం హయాంలో వందల కోట్ల అభివృద్ధి పనులను ఎక్కడ చేశారంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. వాస్తవాలు ప్రజలకు తెలియజేసేందుకు మేము వెళుతుంటే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పోలవరం, అమరావతి, వరికపుడిశెలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేయడం చేతకాక తమ ప్రభుత్వం హయాంలో నిర్మించిన మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేస్తామని చంద్రబబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారం శాశ్వతం కాదని ప్రజలు అంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సరైన రీతిలో బుద్ధి చెబుతామని అన్నారు. పేదలకు వైద్యం అందించేందుకు, ఏర్పాటు చేసిన కళాశాలలు ప్రైవేటు పరం చేస్తే చూస్తూ ఊరుకోబోమని ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు.



హౌస్ అరెస్ట్ అనంతరం మాట్లాడుతున్న బొల్లా

ప్రజాస్వామ్యానికి విఘాతం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జునయాదవ్
- వైద్య కళాశాలను సందర్శించిన యాదవ్
- అరెస్టు చేసి స్టేషన్‌నకు తరలింపు

పిడుగురాళ్ల: పిడుగురాళ్లలో ప్రాజాస్వామ్యానికి విఘాతం కలిగిదని వైఎస్సార్ సీపీ రాష్ట అధికార ప్రతినిధి యనమల నాగార్జునయాదవ్ అన్నారు. పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కామేపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్సార్ వైద్య కళాశాల, వైద్యశాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజీ శుక్రవారం నిర్వహించారు. పోలీసుల ఆంక్షలను లెక్క చేయక మెడికల్ కాలేజీ వద్దకు చేరుకోని కాలేజీ, వైద్యశాల భవనాలను పరిశీలించారు. పిడుగురాళ్ల పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అక్కడకు చేరుకోని నాగార్జున యాదవ్‌ను అరెస్టు చేసి పిడుగురాళ్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం విడుదల చేశారు. అనంతరం స్టేషన్ వద్ద నాగార్జునయాదవ్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఉన్నాడా.. మూర్ఖపు మంత్రి ఉన్నాడా అని ప్రశ్నించారు. మెడికల్ కళాశాల వద్దకు వెళితే ప్రస్తుతం మాటలతో చెప్పాం, మరోసారి చేతలతో చెప్పాల్సి వస్తుందని స్వయాన జిల్లా ఎస్పీ చెప్పడం రాష్ట్రంలో పరిస్థితికి అద్దం పడుతుందన్నారు.



పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న యనమల నాగార్జున యాదవ్

జిల్లా ఎస్పీ కృష్ణారావు, పిడుగురాళ్ల సీఐ శ్రీరాం వెంకట్రావులు తమ ఉద్యోగ ధర్మాన్ని బాగా నిర్వర్తించారని వ్యంగ్యంగా విమర్శించారు.

పేదలకు వైద్యం, విద్యార్థులకు వైద్య విద్య అందాలని సుమారు రూ.600 కోట్లతో పెద్దఎత్తున మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే, దాన్ని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలుకు అమ్మేందుకు చంద్రబాబునాయుడు, నారా లోకేష్ సిద్ధమయ్యారని విమర్శించారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని చెప్పారు. అక్రమ అరెస్టులు ఉద్యమాన్ని ఆపలేవని అన్నారు. ఉదయం నుంచి కనీసం తాగటానికి నీళ్లు కూడా ఇవ్వలేదని అన్నారు. ఎస్పీ కృష్ణారావు చర్యలకు చంద్రబాబునాయుడు వద్ద మంచి మార్కులు ఉంటాయి... మీరు పడిన కష్టానికి భవిష్యత్‌లో చాలా మంచి గిఫ్టులు ఉంటాయని పరోక్షంగా హెచ్చరించారు.

యెనుముల హౌస్ అరెస్టు



గురజాల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెదకూరపాడు-వినుకొండ నియోజకవర్గాల పరిశీలకులు యెనుముల మురళీధర్‌రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మెడికల్ కళాశాల వద్ద శాంతియుత నిరసన చేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. వారిని హౌస్ అరెస్టు చేశారు.

23న సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన

సత్తెనపల్లి: పట్టణంలోని లూథరన్ చర్చి ప్రాంగణంలో ఈనెల 23న సాయంత్రం ఆరు గంటలకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామి 769వ నాటక ప్రదర్శన జరుగుతుందని సంఘం జిల్లా కార్యదర్శి జి రవిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారు ప్రదర్శిస్తారని తెలిపారు.

జిల్లాలో 362.6 మిల్లీమీటర్ల వర్షం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24గంటల వ్యవధిలో 362.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు శుక్రవారం పేర్కొన్నారు. ఐదు మండలాలు మినహా 23మండలాల్లో వర్షం నమోదైంది. అత్యధికంగా అమరావతి మండలంలో 52.6 మి.మీ వర్షం పడగా అత్యల్పంగా రాజుపాలెంలో 1.0 కురిసింది. మాచర్ల 4.2, వెల్దుర్తి 15.2, దుర్గి 42.2, రెంటచింతల 20.2, గురజాల 27.2, దాచేపల్లి 12.0, కారంపూడి 7.4, పిడుగురాళ్ల 24.2, మాచవరం 4.2, బెల్లంకొండ 9.6, అచ్చంపేట 40.2, క్రోసూరు 16.0, పెదకూరపాడు 5.0, సత్తెనపల్లి 10.4, బొల్లాపల్లి 6.2, వినుకొండ 12.8, నూజెండ్ల 28.2, శావల్యాపురం 2.4, నాదెండ్ల 5.4, చిలకలూరిపేట 13.8, యడ్లపాడు 2.2 మి.మీ వర్షం కురిసింది.

టెయిల్ పాండ్ ప్రాజెక్టును సందర్శించిన కేఆర్ఎంబీ చైర్మన్

సత్రశాల(రెంటచింతల): నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును, పవర్ హౌస్‌ను కృష్ణా నదీ జలాల బోర్డు చైర్మన్ బీపీ పాండే శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. కమిటీ సభ్యులు కమల్, ఏపీ జెన్‌కో ఏసీ వెంకట రమణ, శ్రీనివాసులు, ఈఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హౌస్ అరెస్టు

పెదకూరపాడు: పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును శుక్రవారం తెల్లవారుజామున క్రోసూరు పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు లేవని అక్కడకి వెళ్లకూడదు అంటూ క్రోసూరు పోలీసులు మాజీ ఎమ్మెల్యే శంకరరావుకి నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గం అన్నారు. ప్రైవేటీకరణ నిరసిస్తూ శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి వెళ్తుంటే పోలీసులు హౌస్‌అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నంబూరు శంకరరావుకు నోటీసులు అందిస్తున్న పోలీసులు

నాగభూషణ్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మాచవరం/పిడుగురాళ్లరూరల్: ఆంధ్రప్రదేశ్ అంధకారంగా మారిందని, విద్య కోసం పక్క రాష్ట్రాలకు పోయే పరిస్థితి చంద్రబాబు వలన వచ్చిందని వైఎస్సార్ సీపీ రాష్ట వైద్యుల విభాగం సంయుక్త కార్యదర్శి గజ్జల నాగభూషణ్‌రెడ్డి అన్నారు. చలో మెడికల్ కాలేజీలో భాగంగా కామేపల్లి గ్రామంలో ఉన్న మెడికల్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రాంగణంలోకి వెళ్లి సెల్ఫీ దిగారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పూర్తి అయిన మెడికల్ కాలేజీని చూపించేందుకు లోపలకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాకు మణిహారంగా పిడుగురాళ్ల దగ్గరలో మెడికల్ కాలేజీని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మిస్తే చంద్రబాబునాయుడు ప్రభుత్వం నిధులు లేవనే సాకుతో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందన్నారు. ఏడాదిన్నర అవుతున్నా నిర్మాణం శూన్యమన్నారు. రాబోయే రోజుల్లో ప్రైవేటు కాలేజీలు వస్తే పేద విద్యార్థులకు మెడికల్ విద్య అందదని, యాజమాన్యం ఫీజుల రూపంలో దోచుకుంటారని ఆయన అన్నారు. ప్రభుత్వ కాలేజీలు వస్తే రాష్ట్రంలో సీట్లు పెరుగుతాయని అన్నారు. ప్రైవేటీకరణను ఆపేదుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆయన సెల్ఫీ దిగి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు.



గజ్జల నాగభూషన్‌రెడ్డిని మెడికల్ కాలేజీ లోపలకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

చలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను అడ్డుకునేందుకు కుట్ర

- సమన్వయకర్త సుధీర్ భార్గవ్‌రెడ్డితోపాటు ఇరువురు నాయకులు హౌస్ అరెస్ట్
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో తరలిన నేతలు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చలో ప్రభుత్వ మెడికల్ కళాశాల కార్యక్రమానికి నాయకులు వెళ్లకుండా ఉండేందుకు పోలీసులు అడుగడుగున ఆంక్షలు విధించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డిని నరసరావుపేటలో గురువారంరాత్రి హౌస్ అరెస్ట్ చేసి శుక్రవారం కూడా బయటకు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి భర్త చల్లంచర్ల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి అచ్యుత శివప్రసాద్ ఇళ్లకు తెల్లవారుజామున పట్టణ పోలీసులు వెళ్లి హౌస్ అరెస్ట్ చేసి బందోబస్తు నిర్వహించారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జునయాదవ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, వైద్య విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ ముక్తార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, యువజన విభాగం మండల అధ్యక్షుడు కొమెర శివశంకర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువకులు వేర్వేరు మార్గాల ద్వారా పిడుగురాళ్ల మండలం కామేపల్లిలోని ప్రభుత్వం మెడికల్ కళాశాలను సందర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.



నరసరావుపేటలోని డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి ఇంటి వద్ద కాపలాగా ఉన్న పోలీసులు

మర్రి రాజశేఖర్‌ను టీడీపీలోకి తీసుకోవద్దు



మాట్లాడుతున్న టీడీపీ నాదెండ్ల మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, టీడీపీ నాయకులు

- నాదెండ్ల మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ ఆగ్రహం
- సాతులూరులోని టీడీపీ కార్యాలయంలో మండలస్థాయి నాయకులతో ప్రెస్‌మీట్
- పార్టీవారిని వేధించిన వ్యక్తిని మళ్లీ పార్టీలోకి చేర్చుకోవద్దంటూ వేడుకోలు
- టీడీపీ అధినాయకులు నిర్ణయం మార్చుకోకుంటే తాము పార్టీ పదవులకు రాజీనామా చేస్తామంటూ హెచ్చరిక

నరసరావుపేట: ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ టీడీపీలోకి రావడం పట్ల ఆ పార్టీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. నాదెండ్ల మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ అధ్యక్షతన సాతులూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. మర్రి రాజశేఖర్‌పై పలు వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. పార్టీ కోసం కష్టపడిన తమను వదిలి, పదవుల కోసం మారే నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీని నమ్ముకుని తనతోపాటు చాలామంది నాయకులు, కార్యకర్తలు పార్టీ మారనందుకు ఆర్థికంగా, రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి కట్టుబడి ఉన్న నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌ను తిరిగి పార్టీలోకి చేర్చుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గతంలో రాజశేఖర్ తనను బెదిరింపులకు గురిచేశారని, తన వ్యాపారాలపై దాడులు చేయించాడంటూ ఆరోపించారు. నాటి మంత్రులు జూపల్లి కృష్ణారావు, కన్నా లక్ష్మీనారాయణల మద్దతుతో తనపై తప్పుడు కేసులు పెట్టించి, చివరకు కటకటాల పాలు చేశారన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన వారికి, కేసులను ఎదుర్కొన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన పార్టీ అధిష్టానం, ఇప్పుడు దానికి విరుద్ధంగా వ్యవహరించడం తమను బాధించిందని వారు పేర్కొన్నారు. పార్టీనేతల్ని ఇబ్బందులకు గురి చేసిన వ్యక్తికి పార్టీలోకి ఆహ్వానించడం పట్ల తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇప్పటికైనా పార్టీ అధినాయకులు కార్యకర్తల మనోభావాలను పార్టీ గౌరవించి తమ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని వారు డిమాండ్ చేశారు. తమ అభిప్రాయాన్ని మార్చుకోని పక్షంలో మండలస్థాయిలో ఉన్న అన్ని పదవులకూ రాజీనామా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

వైద్య, విద్యారంగాలను సర్వనాశనం చేస్తున్న చంద్రబాబు

- దోచుకునేందుకే ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ
- వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగాల నాయకులను అడ్డుకున్న పోలీసులు
- పేరేచర్ల-కొండమోడు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన
- వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య



వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్యకు హెచ్చరికలు చేస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్

సత్తెనపల్లి: రాష్ట్రంలో వైద్యం, వైద్య విద్యారంగాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సర్వనాశనం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగాల నాయకులు మండిపడ్డారు. పల్నాడు జిల్లాతోపాటు గుంటూరు జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పిడుగురాళ్ల మండలం కామేపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించేందుకు శుక్రవారం బయల్దేరారు. పోలీసులు ఎక్కడిక్కడ చెక్‌పోస్టులు పెట్టి ఆంక్షలు విధిస్తూ అడ్డుకునే ప్రయత్నాలు చేపట్టారు. గుంటూరు నుంచి వచ్చే విద్యార్థి, యువజన విభాగ నాయకులను సత్తెనపల్లిలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విద్యార్థులు ప్రయాణిస్తున్న కార్లు, వాహనాలను ఆపేసి విద్యార్థులను దింపేశారు. మీరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్దకు వెళ్లడానికి వీల్లేదు, నిరసన తెలియజేయడానికి వీల్లేదంటూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగ నాయకులతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. ఆయా విభాగాల నాయకులు సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లోని పేరేచర్ల-కొండమోడు జాతీయ రహదారిపై బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మీడియాతో మాట్లాడుతూ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మేము ఆందోళన చేస్తుంటే అడుగడుగునా ఆంక్షలు పెట్టి పోలీసులు అడ్డుకుంటున్నారు.. మేము పోలీసులను అడుగు తున్నామని, అయ్యా మీ పిల్లలు కూడా ఉన్నారు కదా అని, మీ పిల్లలు చదువు కుంటున్నారన్నారు. గంట సేపు రోడ్డుపై ట్రాఫిక్ ఆగినంత మాత్రాన ప్రజలు ఇబ్బందులు ఏమీ పడరని, మెడికల్ కాలేజీలు ఆగిపోతే రాష్ట్రంలో ప్రజలతోపాటు, కొన్ని లక్షల మంది విద్యార్థులు నష్టపోతారన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుమారు ఐదు నెలల్లో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకు రావడం జరిగిందన్నారు. ఏ ముఖ్యమంత్రి అయినా కేంద్ర ప్రభుత్వానికి ఏం అడుగుతారంటే మా రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు కావాలని... మెడికల్ సీట్లు కావాలని కోరతారన్నారు. దుర్మార్గం ఏందంటే మన రాష్ట్రంలో మాత్రం మెడికల్ సీట్లు వద్దు, మెడికల్ కాలేజీలు వద్దంటూ డైరెక్ట్‌గా ఎన్ఎంసీకి లెటర్ రాసిన వ్యక్తి దుర్మార్గుడు సీఎం చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ యువజన్ విభాగం గుంటూరు, కృష్ణా జిల్లాల కోఆర్డినేటర్ కళ్లం హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ నిరసన తెలియజేస్తే కదా విద్యార్థులు ఏం కోల్పోయారు, పేదలు ఏం కోల్పోయారనేది తెలిసేదన్నారు. గుంటూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి మాట్లాడుతూ అనుమతి లేదని అడ్డుకుంటున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం అడుగుతున్నామని, కనీసం కొంత మందికైనా అనుమతి ఇవ్వాలని అడిగినా పోలీసులు అనుమతి ఇవ్వడం లేదన్నారు. యువజన విభాగం గుంటూరు టౌన్ అధ్యక్షుడు వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ అనుమతి లెటర్ పంపాం, అయితే వారు అనుమతి ఇవ్వలేదన్నారు. నడుచుకుంటూ వెళతామంటే వదల్లేదని, విద్యార్థుల కోసం పోరాటం చేస్తుంటే అనుమతిన్ లేదంటున్నారన్నారు. శాంతియుతంగా చేస్తుంటే దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రెసిడెంట్ షేక్ సుభాని మాట్లాడుతూ అణచివేత ప్రభుత్వమంటే తెలుగుదేశం పార్టీ అని విమర్శించారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కాలేజీకి 50 సీట్లు ఇస్తే, నాకు సీట్లు వద్దు, నేను పేదలకు ఉపయోగపడే పని చేయడం లేదని చెబుతున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడమంటే ఒక వ్యక్తి ధనం ఆర్జించడమేనన్నారు. ఎక్కడిక్కడ విద్యార్థులను ఆపి సత్తెనపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన విభాగం నాయకులు చిన్నాబత్తిని వినోద్‌కుమార్, బాజీ, కానూరి శశిధర్, పిడతల భానుప్రకాష్, పేటేటి నవీన్‌కుమార్, రవీంద్ర, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.